

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

చేవెళ్ల, జూలై 30 : చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అంబేడ్కర్ స్టడీ సెంటర్ చేవెళ్ల కో- ఆర్డినేటర్ షేక్ మహబూబ్ తెలిపారు. ఇంటర్ తోపాటు సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏ. బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల కోసం ఆగస్టు 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9908640914 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



నైవేద్యంతో ర్యాలీగా ఆలయానికి వెళ్తున్న గిరిజన మహిళలు

అంబురాన్నంటిన సీత్లా సంబురాలు

- శంకర్‌కొండ తండాలో భక్తి శ్రద్ధలతో వేడుకలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న గిరిజనులు
- చల్లంగా చూడాలని అమ్మవారికి వేడుకోలు

ఆమనగల్లు , జూలై 30: ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండాలో సీత్లా పండుగ వేడుకలను మంగళవారం గిరిజనులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సీత్లా పండుగ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాన్ని చాటింది. ప్రతి యేటా వర్షాకాలంలో చిన్నపూసాల (సీత్లా) వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. సీత్లా పండుగ వేడుకలకు వివిధ ప్రాంతాలలో ఉండే గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో శంకర్ కొండలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేడుకల్లో భాగంగా గిరిజన మహిళలు నైవేద్యాన్ని తీసుకొని ర్యాలీగా దుర్గామాత ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, తండా వాసులు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. పండుగ సందర్భంగా తండా నాయక్ శ్రీను నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డీజే, బ్యాండ్ వాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గిరిజన యువతీ యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నాయకులు పత్యానాయక్, అమర్‌సింగ్, మానయ్య, విజయ్‌రాథోడ్, జాన్, సందీప్, అంజయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- బొక్క నర్సింహారెడ్డి, తల్లోజి ఆచారి

రంగారెడ్డి అర్బన్, జూలై 30 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుం దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి ఆరోపించారు. బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చ డంలో కాంగ్రెస్ విఫలమవుతుందన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, ప్రతాప్, సురేందర్ యాదవ్, అందె బాబయ్య, కొత్త అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అనేక అంశాల్లో అభివృద్ధి వైపు దూసుకు పోతోంది. ప్రధానంగా పరిశ్రమలు ఎక్కువగా పెరుగుతుండడంతో అనేకమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అనేక విభాగాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో జిల్లా నిలుస్తోంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లా హైదరాబాద్ నగరంలో కలిసి ఉండడంతో లాభం చేకూరుతోంది. ఇక్కడ నుంచి వేల కోట్ల రూపాయల ఎగుమతులు కూడా సాగుతున్నాయి. నగర శివార్లలోని కొత్తగా నెలకొల్పిన సంస్థల వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2లక్షల పరిశ్రమలున్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో భారీగా పెరుగుదల నమోదవుతోంది.

- ఉమ్మడి జిల్లాలో 2 లక్షల పరిశ్రమలు
- గత ఏడాది రూ.60వేల కోట్ల ఎగుమతులు
- అంతర్జాతీయ ఎగుమతుల్లో మేటి
- పౌల్ట్రీ రంగంలో అగ్రస్థానం



ఉపాధిలో దూకుడు

శివారు ప్రాంతాల్లో శరవేగంగా పారిశ్రామిక విస్తరణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధితో పాటు పలు ఆర్థికాభివృద్ధి అంశాల్లో శరవేగంగా దూసుకుపోతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేగవంతంగా జరుగుతున్న పారిశ్రామిక విస్తరణ కారణంగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. ఐటీ, ఫార్మా ఎగుమతులు కూడా ఈ రెండు జిల్లాల నుంచే అధికంగా జరుగుతుండడం గమనార్హం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే (2023-24)లో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. రంగారెడ్డి జిల్లా పలు రంగాల్లో అగ్రభాగాన ఉంది. విద్య, ఆరోగ్య, ఆర్థిక, సామాజిక అంశాల్లో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలు ముందున్నాయి. రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని తీసుకు రావడమే కాక కొత్త కంపెనీల ఏర్పాటు, పెట్టుబడుల్లో ముందంజలో ఉన్నాయి. ఉపాధి అవకాశాల్లో కూడా ఉమ్మడి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. నగర శివార్లలోని కొత్తగా నెలకొల్పిన సంస్థల వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2లక్షల పరిశ్రమలు ఉన్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో భారీగా పెరుగుదల నమోదవుతోంది. తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా మేడ్చల్ జిల్లా తలసరి ఆదాయంలో మూడో స్థానంలో, స్థూల ఉత్పత్తిలో నాలుగో స్థానంలో నిలిచింది. ఇక కోళ్ల, ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో 2.85కోట్ల కోళ్ల ఉత్పత్తి ఉండగా రంగారెడ్డి జిల్లాలోనే 2.40 కోట్ల కోళ్ల ఉత్పత్తి ఉండడం గమనార్హం. నగర శివార్లలో ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా పలు ప్రాంతాల్లో నూతనంగా పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తుండడంతో ప్రతి ఏటా పారిశ్రామిక విస్తరణ శరవేగంగా సాగుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం, రీజినల్ రింగురోడ్డు ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉండడంతో సరుకు రవాణాకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వాడలను మరింత విస్తరించడంతో పాటు శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, మంఖాల్, మహేశ్వరం, షాబాద్ తదితర ప్రాంతాల్లో ఐటీ పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు, ఫుడ్ పార్కులు, ప్లాస్టిక్ పార్కులు, లెదర్ పార్కులను అభివృద్ధి చేస్తోంది.

27.60లక్షల వంటగ్యాస్ కనెక్షన్లు

రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 27.60లక్షల వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాలు క్రమేపీ విస్తరించడంతో వంట ఇంధనానికి డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్ మహానగరంలో ఉమ్మడి జిల్లా అంతర్భాగంగా ఉన్న విషయం తెలిసిందే. నగరం విస్తరించడంతో ఉమ్మడి జిల్లాలో పట్టణ జనాభా ప్రతి ఏటా గణనీయంగా పెరుగుతోంది. ప్రతి ఏడాదీ లక్షలాది మంది దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి జీవిస్తున్నారు. ఆధునిక జీవన విధానానికి అలవాటు పడుతున్న ప్రజలు వంట ఇంధన వినియోగ విషయంలో అవగాహన పెంచుకుంటున్నారు. కట్టెలు, కిరోసిన్ పొయ్యిలకు స్వస్తి చెబుతున్నారు. వంట గ్యాస్‌ను సామాన్యులకు, పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అయితే గడిచిన ఏడాదితో పోలిస్తే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వంటగ్యాస్ కనెక్షన్లు భారీగా పెరగగా మేడ్చల్ జిల్లాలో 55వేలు తగ్గాయి. ఇక్కడ హెచ్‌పీసీఎల్ కనెక్షన్లు దాదాపు 2లక్షల వరకు తగ్గడం గమనార్హం. ఇదే సమయంలో బీపీసీఎల్, ఐఓసీఎల్ కనెక్షన్లు పెరిగాయి. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే 52వేల గ్యాస్ కనెక్షన్లు పెరిగాయి.

మొత్తం పరిశ్రమలు


రంగారెడ్డి	1,09,164
మేడ్చల్	88,037
వికారాబాద్	15,001

2023-20224లో వంట గ్యాస్ కనెక్షన్లు... ఆయిల్ కంపెనీల వారీగా (లక్షల్లో)

జిల్లా	ఐఓసీఎల్	హెచ్‌పీసీఎల్	బీపీసీఎల్	మొత్తం
రంగారెడ్డి	7.81	3.25	2.33	13.39
మేడ్చల్	6.29	2.47	2.70	11.46
వికారాబాద్	1.39	0.92	0.44	2.75

రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే 2023-24 సూచికలు ఇలా...

తలసరి ఆదాయం		
జిల్లా	తలసరి ఆదాయం	
రంగారెడ్డి	రూ. 9,46,862	
మేడ్చల్	రూ. 2,95,514	
వికారాబాద్	రూ. 1,80,241	
జిల్లా స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)		
జిల్లా	స్థూల ఉత్పత్తి	
రంగారెడ్డి	రూ. 2,83,419	
మేడ్చల్	రూ. 88,867	
వికారాబాద్	రూ. 19,840	
ఎగుమతులు		
జిల్లా	సరుకుల ఎగుమతులు	శాతం
రంగారెడ్డి	రూ.34,249కోట్లు	29శాతం
మేడ్చల్	రూ.25,444కోట్లు	22శాతం
కోళ్ల ఉత్పత్తి		
రంగారెడ్డి	2.40 కోట్లు	
మేడ్చల్	0.40 కోట్లు	
వికారాబాద్	0.05 కోట్లు	
వంటగ్యాస్ కనెక్షన్లు (లక్షల్లో)		
జిల్లా	2022-23	2023-24
రంగారెడ్డి	12.82	13.39
మేడ్చల్	12.01	11.46
వికారాబాద్	2.25	2.75



రుణమాఫీ చెక్కును రైతుకు అందజేస్తున్న కలెక్టర్ శశాంక

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూలై 30 : అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతుల ఆధ్వర్యంలో రుణమాఫీ రెండో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం నిర్వహించిన ఈ మహోత్తరమైన కార్యక్రమాన్ని రైతులు పండుగలా చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో మొదటి విడత సుమారు 49,700మంది రైతులకు 258.15 కోట్ల రూపాయలు కేటాయించగా, రెండో విడతగా సుమారు 22,915 మంది రైతులకు 218.12కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 72,615 మంది రైతులకు 476.30 కోట్ల రూపాయలు రుణమాఫీ పథకం ద్వారా ప్రభుత్వం జిల్లాకు వెచ్చించిందన్నారు. ఇప్పటి వరకు జరిగిన రుణమాఫీలో టెక్నికల్ పరంగా ఏదైనా రైతుకు రుణమాఫీ అందకపోతే వ్యవసాయ అధికారులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొందరికి రుణమాఫీ అందకపోవడానికి గల కారణాలు తెలుసుకోవడానికి ఆధార్ కార్డుతో మండలాల్లో వ్యవసాయ అధికారుల వద్ద తెలుసుకోవచ్చన్నారు. అంతే కాకుండా జిల్లా, మండల వ్యవసాయ శాఖ స్థాయిలో రైతులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు గ్రీవెన్స్‌లో 1100 దరఖాస్తులు వచ్చాయని వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని అర్హులైన ప్రతీ రైతుకు రుణం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రూ.లక్షలోపు, రూ.లక్ష నుండి లక్షా 50 వేల వరకు రుణమాఫీ అర్హులుగా ఉన్న రైతులకు తిరిగి మళ్లీ పంట రుణాలు ఇచ్చే విధంగా సహకరించాలని బ్యాంక్ అధికారులకు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమంలో రైతులకు రుణాలు ఇచ్చే దిశగా ముందుకు వెళ్లాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, రైతుసంఘాల అధ్యక్షులు, రైతులు, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బేగరికంచ, మీర్ఖాన్‌పేటలకు మహర్దశ

కందుకూరు/మహేశ్వరం, జూలై 30 : ఒకప్పుడు మారుమూల గ్రామాలుగా ఉన్న బేగరికంచ, మీర్ఖాన్‌పేటలకు మహర్దశ పట్టింది. ఇప్పుడు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే గ్రామాలుగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. ఐదు సంవత్సరాల క్రితం కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట పంచాయతీ పరిధిలోని బేగరికంచ గ్రామం అనుబంధ గ్రామంగా ఉండేది. గత ప్రభుత్వం దీనిని గ్రామ పంచాయతీగా మార్చింది. ఈ గ్రామంలో 60ఎకరాలలో 765 పవర్‌గ్రిడ్, 100 ఎకరాలలో 420కేవీ సబ్ సబ్‌స్టేషన్, 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లను సైతం ఏర్పాటు చేశారు. 45ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలోని అమేజాన్ డాటా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే సుమారు 60ఎకరాలను కేటాయించి మెడికల్ కళాశాలతో పాటు 400పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. బేగరికంచ గ్రామ పంచాయతీకి అనుకొని ఉన్న మీర్ఖాన్‌పేట, పంజగూడ, తిమ్మాయపల్లి రెవెన్యూ పరిధిలో ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులకు అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి చొరవతో ఎకరానికి 121గజాల ఇంటి స్థలం ఇవ్వడానికి 600ఎకరాలను కేటాయించి, హెచ్‌ఎండీఏ తరహాల్లో అభివృద్ధి చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పుడు బేగరికంచ, మీర్ఖాన్‌పేట గ్రామ పంచాయతీల సరిహద్దుల్లో సర్వే నెంబర్ 112లో 57 ఎకరాలలో వృత్తి విద్యానైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సుమారు 100 కోట్ల నిధులను కేటాయించారు. అలాగే అక్కడే అన్ని హంగులతో ఐటీఐ, ఏటీసీ స్కూల్ భవనాన్ని నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. అలాగే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కమ్యూనిటీ హాల్ భవనానికి శంకుస్థాపన చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వచ్చే రెండు సంవత్సరాలలోపు ఈ ప్రాంతం అన్ని హంగులతో అభివృద్ధి చెందనున్నట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహేశ్వరాన్ని తీర్చిదిద్దేందుకు పెద్దపీట : కేఎల్లార్

మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేయనుందని మాజీ ఎమ్మెల్యే, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్ఖాన్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ శంకుస్థాపన పనులను మంగళవారం సాయంత్రం మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడ 600ఎకరాలల్లో హెచ్‌ఎండీఏ తరహాలో అభివృద్ధి చేస్తున్న ప్లాట్లలో రైతులు ఇళ్లు కట్టుకోవడానికి, ఇదే ప్రాంతంలో ఐటీఐ, ఏటీసీ, పీహెచ్‌సీ, కమ్యూనిటీ హాల్‌తో పాటు స్కిల్ యూనివర్సిటీని తమ ప్రభుత్వం నిర్మించనున్నట్లు తెలిపారు. దీంతో నగరవాసులకు ఉండే వసతులన్నింటినీ ఇక్కడి ప్రజలకు సమకూర్చనున్నట్లు తెలిపారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి కందుకూరు రావడంతో వ్యాపార సంస్థలను బంద్ చేయించారని అసెంబ్లీలో చేసిన ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, సరికొండ జగన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేఎల్లార్ మాట్లాడుతూ ఆగస్టు ఒకటిన నెట్ జీరో సిటీలో ఏర్పాటు చేయనున్న సీఎం సభకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి పదివేల మందిని సమీకరిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో వివిధ గ్రామాలకు చెందిన రైతుల భూములతో పాటు ప్రభుత్వ భూములు మొత్తం 19వేల ఎకరాలను సేకరించాలని చూడగా అక్కడ కేవలం 12 వేల ఎకరాలే సేకరించారన్నారు. అందులో కాంగ్రెస్ ప్రభుత్వం మల్టీ మోడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనుందని చెప్పారు. అందుకోసం మొదటగా ఆగస్టు 1న స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నామన్నారు.



సిద్ధమవుతున్న సీఎం సభావేదిక

షాద్‌నగర్‌కు 'అయోధ్య రాముడి ధనుర్బాణాలు'

- ఆగస్టు 1న భక్తులు తిలకించేందుకు అవకాశం

షాద్‌నగర్, జూలై 30: అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించబోతున్న రామచంద్రుడి చేతిలో ఉండాల్సిన ధనుర్బాణాలు గురువారం షాద్‌నగర్‌కు చేరుకోనున్నాయి. వాటిని భక్తులు తిలకించేందుకు ఆగస్టు 1న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రదర్శించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్రమూర్తి భక్తుడైన చల్లా శ్రీనివాసశాస్త్రి కిలో బంగారం, 13 కిలోల వెండితో వాటిని తయారు చేయించారు. ఈ ధనుర్బాణాలను అయోధ్య రామాలయానికి తరలించే ముందు షాద్‌నగర్ ప్రజలు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



'ఫార్మాసిటీ' రైతులకు ఇళ్ల స్థలాలివ్వండి

యాచారం, జూలై 30 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కోసం పట్టా, అసైన్డ్ భూములు ఇచ్చిన రైతులందరికీ కందుకూరు మండలంలోని బేగరికంచ సమీపంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని యాచారం మండలంలోని కుర్మిద్ద, మంగలిగడ్డతండా, మర్లకుంట తండాల రైతులు మంగళవారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎకరం భూమి తీసుకుంటే 121 గజాల స్థలం ఇస్తామని గత ప్రభుత్వ హయాంలో ప్రకటించారని రైతులు కలెక్టర్‌కు వివరించారు. నేడు ప్రభుత్వం మారడంతో ఇంటి స్థలం రాదనే ఆందోళనలో ఉన్నట్లు వాపోయారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్.. అందరికీ న్యాయంచేసి ఆదుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీలం శ్రీకాంత్, ఎస్టీ సెల్ మండల నాయకులు భీమ్‌రావునాయక్, మాజీ ఎంపీటీసీ శంకరయ్య, నాయకులు అశోక్ మధు, శ్రీనివాస్ నాయక్, అమర్‌సింగ్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కుర్మిద్ద రైతులు

శివారు పురపాలికల్లో 44 గ్రామాలు విలీనం?

- ఎన్నికల ప్రక్రియ నిలిపివేత
- కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)



ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న 44 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ గ్రామాలను సమీపంలోని పురపాలక సంఘాల్లో విలీనం చేసే కసరత్తు మొదలు పెట్టింది పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు మొదటి వారంలోగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఇటీవల ప్రభుత్వం అధికారులకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే నగర శివార్లలోని ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ చేపట్టరాదని తాజాగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే దీనిపై అధికారులు ఎవరూ మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. కానీ గ్రామాల విలీన ప్రక్రియపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపుల అనుకున్న గ్రామాలే. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 11 గ్రామాలు ఉండగా మిగతావి మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీగా ఉన్న ప్రాంతంలో ఎక్కువ గ్రామాలు కలిస్తే వీటిని కార్పొరేషన్ చేయాలని నిర్ణయించారు. ఇలా శివార్లలో కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నట్లు తెలిసింది. అయితే దీనికి ఇంకా తుది రూపు రావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కీసర రూరల్: అదనపు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్లు

కీసర రూరల్, జూలై 30: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించిన రాధికాగుప్తను నాగారం, దమ్మాయిగూడ, పోచారం మున్సిపల్ చైర్మన్లు కౌకుంట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత, బోయపాటి కొండల్‌రెడ్డిలు మంగళవారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: అదనపు కలెక్టర్ రాధిక గుప్తను మంగళవారం అంతాయిపల్లిలోని కలెక్టరేట్‌లో శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, మేనేజర్ శ్రావణ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తాండూరు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిశంకర్ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ రవి శంకర్

తాండూరు, జూలై 30: తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. రవి శంకర్ గతంలో ఆస్పత్రి సూపరిండెంట్‌గా పనిచేశారు. ఇక్కడ పని చేసిన ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ మూర్తి మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీపైవెళ్లారు. తాండూరు ఆస్పత్రి నుంచి బషీరాబాద్ ఆస్పత్రికి బదిలీపై వెళ్లిన డాక్టర్ రవిశంకర్ డిప్యూటేషన్‌పై తిరిగి తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. గతంలో రవిశంకర్ సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో కాయకల్ప అవార్డు వచ్చింది.

రోడ్లు బాగు చేయాలి



ఆర్అండ్‌బీ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, జూలై 30: కొత్తగడి నుంచి మోమిన్ పేట్ వెళ్లే రోడ్డును వెంటనే బాగు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్అండ్‌బీ కార్యాలయం ముందు ధర్నా చేసి డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోకల సతీష్, బొస్సా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌లో మోడల్ కళాశాల విద్యార్థి ప్రతిభ

▸ ఆగస్టు 16న జపాన్‌లో జరిగే పోటీలకు ఎంపిక

చేవెళ్ల, జూలై 30 : మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి శర్వజిత్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌లో విజయం సాధించారని ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ నాలెడ్జ్ పోటీలో శర్వజిత్ ప్రతిభ కనబర్చారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలో అత్యంత ప్రభత చూపడంతో ఆగస్టు 16న జపాన్‌లో జరగబోయే ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌కు శర్వజిత్ ఎంపికయ్యాడని తెలిపారు. ఈమేరకు అధ్యాపకులు శర్వజిత్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

చేవెళ్ల, జూలై 30 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి సైదులు తెలిపారు. కాగ్నిజెంట్ మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆల్ ఇండియా, తెలంగాణ మైండ్ స్పార్క్ సంస్థ ప్రతినిధులు మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న గురుకుల పాఠశాలలో 20 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ యాదయ్యగౌడ్ తదితరులతో కలిసి సైదులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఉచితంగా 20 కంప్యూటర్లు ఏర్పాటు చేయడయం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ నర్సింలు, కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు మేఘ, ఆనంద్, అచ్యుత్, ఉపాధ్యాయులు, మణిమాల, హెచెస్ రమ్య, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అవసరానికి సరిపడా విద్యుత్ సరఫరా

▸ టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారుఖీ



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముషరఫ్ ఫారుఖీ

శంషాబాద్, జూలై 30 : అవసరానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారుఖీ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రం దర్గగిరిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ముషారఫ్ ఫారుఖీ ప్రారంభించారు. సంస్థ ఇంజనీర్లతో పాటు సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. లోడు పెరిగిన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు కానీ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు కానీ.. అదనంగా నూతన లైన్లు ఏర్పాటు చేయుటకు టీజీఎస్పీడీసీఎల్ సిద్ధంగా ఉందని తెలిపారు. వేసవిలో రికార్డుస్థాయి డిమాండ్ కరెంటు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే ఏడాది కూడా డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయం, పరిశ్రమలకు గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా సరఫరా చేయాలని ఆయన సూచించారు. అనంతరం సబ్‌స్టేషన్ పరిధిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో ఇష్టారాజ్యం

▸ గంటల తరబడి క్యూలో వృద్ధుల ఇక్కట్లు

▸ పోస్టల్ అధికారుల తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం

మర్పల్లి, జూలై 30: ప్రభుత్వం ప్రతీనెల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ మంజూర్ చేస్తుంటే పంపిణీ చేసే పోస్టల్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వారం రోజుల కిందటే పింఛన్ పంపిణీ జరిగితే మర్పల్లి మండల కేంద్రంలో మాత్రం మంగళవారం పింఛన్ పంపిణీ చేసేందుకు పోస్టల్ అధికారులు పంచాయతీ కార్యాలయానికి చేరుకోగా గత వారం రోజులుగా పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. పంపిణీ చేసే పోస్టల్ అధికారులు వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ స్థానిక పోలీసులను పిలిపించి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులను గంటల తరబడి క్యూలో నిలబెట్టి పింఛన్ పంపిణీ చేశారు. కొంత మంది పింఛన్‌దారులు ప్రతీనెల మాదిరిగానే పేర్లు పిలవమంటే అలా ఇచ్చేందుకు కుదరదని, క్యూలో నిలబడితేనే ఇస్తామని చెప్పడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పింఛన్ ఎందుకు ఆలస్యం అయిందని ప్రశ్నిస్తే సాంకేతిక సమస్య తలెత్తిందంటూ పొంతన లేని సమాధానం ఇచ్చారు. రూ.2016 అందించాల్సిన పింఛన్‌ను చిల్లర లేవనే సాకుతూ రూ.2వేలు మాత్రమే ఇచ్చారని పలువురు లబ్ధిదారులు వాపోయారు.

హైవే కోసం నిర్మాణాల తొలగింపు

▸ 94 మందికి నోటీసుల జారీ

▸ పరిహారం చెల్లింపునకు సన్నాహాలు



బాధితులతో రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారుల సమావేశం

మేడ్చల్ టౌన్, జూలై 30: మేడ్చల్‌లో జాతీయ రహదారి వెడల్పులో స్థలాలు/నిర్మాణాలు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించేందుకు రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులు నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శైలజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మేడ్చల్ చెక్‌పోస్టు నుంచి పట్టణంలోని ఐటీఐ వరకు హైవేపై 73పిల్లర్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణంలో భాగంగా రోడ్డు వెడల్పునకు రోడ్డుకిరువైపులా ఉన్న ప్రైవేట్ స్థలాల స్వాధీనానికి అధికారులు కసరత్తు చేపట్టారు. మేడ్చల్, అత్వెల్లి, ఎల్లంపేట పరిధిలో తొమ్మిదెకరాల పైచిలుకు స్థలాల స్వాధీనానికి రంగం సిద్ధం చేశారు. రోడ్డు కోసం స్థలాలు కోల్పోతున్న 115 మందిని గుర్తించి 94 మందికి నోటీసులు జారీ చేశారు. మేడ్చల్‌లో 0.4హెక్టార్లు, అత్వెల్లిలో 1.2 హెక్టార్లు, ఎల్లంపేట పరిధిలో 2.1హెక్టార్లను స్వాధీనం చేసుకుంటామని అధికారులు ప్రకటించారు. నోటీసులు పంపిన భూ యజమానులకు ప్రభుత్వం నుంచి అందే పరిహారంపై అధికారులు చర్చించారు. యజమానులు తమ ఆస్తుల దస్తావేజులు, వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పరిహారం ఇస్తారని అధికారులు బాధితులకు స్పష్టం చేశారు.

సేఫ్ జోన్‌లో 75-100అడుగుల లోపు స్థలాలు!

జాతీయ రహదారి పనులు ప్రారంభించిన నాటి నుంచి రోడ్డు వెడల్పులో స్థలాలు కోల్పోతున్నామంటూ టెన్షన్ పడుతున్న వారికి ఊరట లభించింది. రోడ్డుకు ఇరువైపులా 75అడుగుల లోపు స్థలాలను మాత్రమే ప్రస్తుతం అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుంటూ నోటీసులుజారీ చేయడంతో రహదారికి ఆనుకొని ఉన్న స్థలాల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. మేడ్చల్‌లోని పెద్దచెరువు వాగు నుంచి అత్వెల్లి వరకు రహదారికి ఇరువైపులా చాలా నిర్మాణాలు 75-100 అడుగుల లోపే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో 75 అడుగుల లోపు తాత్కాలిక నిర్మాణాలు ఉన్నాయి. దీంతో 75-100 అడుగుల పరిధి నిర్మాణాలు/స్థలాలు సేఫ్‌జోన్‌లో ఉన్నాయి. అధికారులు నోటీసులిచ్చిన వారిలో ముబారక్ రెస్టారెంట్ నుంచి అత్వెల్లి వైపు ఉన్నవారు ఉన్నారు. ఇక్కడున్నవన్నీ తాత్కాలిక నిర్మాణాలే కావటంతో రోడ్డు వెడల్పు పనులు సాఫీగానే కొనసాగే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇదిలా ఉంటే రోడ్డు వెడల్పులో భూమి కోల్పోతున్న వారికి గజానికి ఎంత కట్టిస్తారనే దానిపై అధికారుల్లో స్పష్టత లేకపోవటం గమనార్హం.

నిరుపయోగంగా ట్రీ గార్డులు

▸ లక్షల రూపాయలు వృథా

▸ అధికారుల అలసత్వంపై ప్రజల ఆగ్రహం



నాగారం మున్సిపల్ రాంపల్లి వార్డు కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న టీ గ్రార్డులు

కీసర రూరల్, జూలై 30: నాగారం మున్సిపల్ అధికారులు హరితహారం నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తున్నారు. వెరసి లక్షల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనంతో తయారు చేసిన వస్తువులు నిరుపయోగంగా మారుతున్నాయి. నాగారం మున్సిపల్ రాంపల్లిలోని వార్డు కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న ట్రీ గార్డులే ఇందుకు నిదర్శనం. హరితహారంలో భాగంగా మొక్కల సంరక్షణకు తయారు చేయించిన వందలాది ట్రీగార్డులు వృథాగా కుప్పలుగా పడిఉన్నాయి. సంవత్సరకాలంగా వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపడుతున్నాయి. అయినప్పటికీ అధికారుల్లో చలనం రావడం లేదు. ప్రజాధనమంటే లెక్కే లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ట్రీ గార్డులు తయారు చేయించడంలో ఉన్న చొరవ వినియోగంలో లేకపోవటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో హరితహారం నిర్వహణ ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది. ఆశాఖ అధికారులే గత సంవత్సరం వాటిని తయారు చేయించారు. అయితే వాటిని మొక్కల సంరక్షణకు వినియోగించడం మరిచారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు టెండర్లు, కాంట్రాక్టులు, నిర్మాణ, అభివృద్ధి పనులపై చూపిస్తున్న ఆసక్తి హరితహారంపై కనబరచడం లేదన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను అడగ్గా ఈ సంవత్సరం వినియోగిస్తామని తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మున్సిపల్ నిధులతో తయారు చేయించిన ట్రీ గార్డులను వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

▸ సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ

నందిగామ, జూలై 30: ప్రజా సమస్యలపై కార్యకర్తలు నిరంతరం పోరాడాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ సూచించారు. మంగళవారం సీపీఎం రంగారెడ్డి జిల్లా శిక్షణా తరగతుల్లో భాగంగా రెండోరోజు నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి శివారులోని కాకా గెస్ట్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమానికి జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా పోరాటాల్లో కార్యకర్తల కృషి మరువలేనిదని, ప్రజా సమస్యలపై మరింత పోరాడాలన్నారు. హిందూ రాజ్య స్థాపనే లక్ష్యంగా బీజేపీ పరిపాలన చేస్తుందని ఆరోపించారు. దేశంలో మతోన్మాదం, మూఢనమ్మకాలు పెరిగిపోయాయని, దీనికి బీజేపీ ప్రతినిధిగా ఉందన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని, వారు అనుకున్నట్లు రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లు తొలగిస్తే దేశం ప్రమాదంలోకి వెళ్తుందని సూచించారు. సాంస్కృతిక, సామాజిక, సాంకేతికత, విద్యారంగాల్లో నైపుణ్యాలు పెంపొందించాలని, దానికనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బాస్కర్, రాజు, సామ్యేల్, చంద్రమోహన్, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీను నాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, మహమ్మద్ బాబు, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జాన్ వెస్లీ



సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నీలం మధు, గరుగు రాజు ముదిరాజ్ తదితరులు

ముదిరాజ్‌ల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, జూలై 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలోని ముదిరాజులందరి పక్షపాతి అని, మనం ఐక్యంగా ఉంటేనే రాజకీయంతో పాటు అన్నిరంగాల్లో రాణిస్తామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని హిమాయత్ నగర్‌లోని పీవీ కన్వెన్షన్ హాల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజుల ఐకమత్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. సమాజంలో మనకంటూ ప్రత్యేక గుర్తింపు రావాలన్నా.. మన హక్కులను సాధించుకోవాలన్నా ముదిరాజులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ బిడ్డలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఇతర స్థానాల్లో గెలిచే విధంగా కలిసి కట్టుగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కాంగ్రెస్ తరపున మెదక్ ఎంపీగా పోటీ చేసిన నీలం మధు, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు చిలుకూరు గరుగు రాజు ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణపురం మహేందర్ ముదిరాజ్, శ్రీరాములు ముదిరాజ్, సంఘం సీనియర్ నాయకులు చిలుకూరు సదువు రాంచందర్ ముదిరాజ్, జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ముదిరాజ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు

కడ్తాల్, జూలై 30: జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో అక్రమాలకు చోటివ్వొద్దని డీఆర్డీవో శ్రీలత అధికారులకు సూచించారు. పనుల్లో కూలీల సంఖ్యను పెంచి నిబంధనల మేరకు నడుచుకోవాలని కోరారు. కడ్తాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకం 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. ఎంపీడీవో సుజాత అధ్యక్షతన నిర్వహించిన సభకు డీఆర్డీవో శ్రీలత, ఏపీడీలు సుభాషిణి, సక్రియానాయక్, ఎస్ఆర్పీ వెంకన్నలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన ఈజీఎస్ పనులపై గ్రామాల వారిగా నివేదికను సోషల్ ఆడిట్ బృందం సభ్యులు చదివి వినిపించారు. వెలుగు చూసిన తప్పిదాలను సభ దృష్టికి తెచ్చారు. డీఆర్డీవో మాట్లాడుతూ ఆధార్ కార్డు ఆధారంగా స్థానికతను బట్టి ఈజీఎస్ జాబ్ కార్డులు ఇవ్వాలని సూచించారు. పనుల్లో ఎక్కడ పొరపాట్లకు తావివ్వకూడదని తెలిపారు. అక్రమాలు జరిగినట్లు రుజువైతే అట్టి డబ్బును రికవరీ చేయడం జరుగుతుందని చెప్పారు. వన మహోత్సవం లక్ష్యాల పూర్తికి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చొరవ తీసుకోవాలని శ్రీలత కోరారు. కార్యక్రమంలో ఏఈ పరమేశ్, ఏపీవో లలిత, టీఏ అంజయ్య, సద్గుణ, సుగుణ, వివిధ గ్రామాల ఈజీఎస్ క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాండూరు జిల్లా ఆస్పత్రికి జనరల్ సర్జన్ నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూలై 30: తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జనరల్ సర్జన్ బదిలీతో 'శస్త్ర చికిత్సలకు బ్రేక్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్, జిల్యా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ స్పందించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ అజయ్‌కుమార్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీల ప్రక్రియ పూర్తి కాగానే రెగ్యులర్ సర్జన్‌ను తాండూరు ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై పంపనున్నారు. జిల్లా ఆస్పత్రిలో సర్జన్ బదిలీవల్ల శస్త్రచికిత్సలు నిలిచిపోయిన విషయాన్ని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్, కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఈ సమస్య తీరింది.

రూ.40 కోట్లు కొల్లగొట్టారు!

▸ సినీ నిర్మాత బషీద్, బ్యాంకు మేనేజర్ కలిసి ఘరానా మోసం

▸ 'ఆదిత్య బిర్లా' ఖాతాల నుంచి సొమ్ములు కొల్లగొట్టిన వైనం

▸ బ్యాంకు మేనేజర్ సహా ముగ్గురి అరెస్టు

▸ రాజంపేట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బషీద్!

హైదరాబాద్ సిటీ, జూలై 30 : ఒక సినీ నిర్మాతతో కలిసి బ్యాంకు మేనేజర్, మరో ఉద్యోగి కుమ్మక్కై మోసపూరిత లావాదేవీలతో రూ.40 కోట్లు కొల్లగొట్టారు. ఆర్థిక మోసానికి పాల్పడిన ఈ కేసులో సినీ నిర్మాతతో పాటు బ్యాంకు మేనేజర్‌ను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇండస్ ఇండ్ బ్యాంకు శంషాబాద్ జోన్‌లో బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్న రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్ అక్రమ లావాదేవీలు జరిపి బ్యాంకుకు రూ.40 కోట్లు నష్టం చేశారని బ్యాంకు జోనల్ హెడ్ మణికందన్ రామనాథన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రామస్వామి, రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వ్యాపారి, సినీ నిర్మాత అయిన షేక్ బషీద్ ప్రోద్బలంతో ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. మొదటి నుంచి ఆర్థిక నేరాలకు పాల్పడే బషీద్‌కు బ్యాంకు మేనేజర్‌తో పరిచయమైంది. సులభంగా రూ.కోట్లలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఉన్న బషీద్.. బ్యాంకు మేనేజర్‌కు సలహా ఇచ్చాడు. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థకు చెందిన ఖాతాలన్నీ ఇండస్ ఇండ్ బ్యాంకులోనే ఉండడంతో అనధికారికంగా ఆ ఖాతాల్లోని డబ్బులు వేరే ఖాతాల్లోకి మళ్లించి రూ.కోట్లు కొల్లగొట్టొచ్చని చెప్పాడు. రూ.వేల కోట్ల టర్నోవర్ కలిగిన సంస్థ కావడంతో కొట్టేసిన సొమ్మును గుర్తించడానికి చాలా సమయం పడుతుందని తెలిపాడు. మోసపూరిత లావాదేవీలకు ప్రతిఫలంగా పార్చ్యూనర్ కార్లు బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకు అంగీకరించిన మేనేజర్ రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్‌తో కలిసి అనధికారికంగా, సంస్థ నుంచి ఎలాంటి అనుమతులు, చెక్కులు లేకుండా మోసపూరిత లావాదేవీలు జరిపి రూ.40 కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2006లో ఎస్‌బీకే ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించిన బషీద్.. పలు చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. 2024లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆర్థిక మోసాల్లో ఆరితేరిన బషీద్‌పై ఇప్పటి వరకు పలు స్టేషన్లలో 10కి పైగా కేసులు ఉన్నట్లు గుర్తించారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు తీర్చండి

▸ సీఎంకు పోస్టుకార్డులు పంపిన రిటైర్డ్ ఉద్యోగులు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, జూలై 30: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను(ఉత్తరాలను) పంపించారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం మండలంలోని చౌదరిగూడ, వెంకటాద్రి టౌన్‌షిప్‌లోని పోస్టాఫీసు వద్దకు చేరుకుని తమ సమస్యలను పరిష్కరించాలని రాసిన పోస్టుకార్డులను పోస్టుబాక్సులో వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల పాటు సరైన గాలి, వెలుతురు లేని భూగర గనుల్లోకి వెళ్లి 300మీటర్ల లోతులో ఉన్న బొగ్గును తెలికి తీస్తూ ఎంతో ఇబ్బంది పడినట్లు గుర్తుచేశారు. కానీ నేడు అతి తక్కువ పింఛన్‌తో, వయోభారంతో ఉన్న తాము కనీసం మందులను కొనుక్కోలేని స్థితిలో ఉన్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, ఇదే తరుణంలో తమను సైతం ఆదుకోవాలని కోరారు. సింగరేణి రిటైర్డు ఉద్యోగులందరికీ తెల్లరేషన్‌కార్డు ఇవ్వడంతోపాటు అపరిమిత వైద్యసౌకర్యాలు, 200చదరపు గజాల ఇంటిస్థలం లేదా ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని పోస్టుకార్డులో కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆళవందార్ వేణుమాధవ్, కె.బీరయ్య, రాజయ్య, లక్ష్మినారాయణ, మల్లయ్య, రఫిక్, రామరాజు, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, ప్రకాశ్ రావు పాల్గొన్నారు.

ఆలయ చరిత్రను భక్తులకు వివరిస్తా

▸ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వికారాబాద్, జూలై 30: అనంతగిరి ఆలయం, అనంతపద్మనాభస్వామి చరిత్రను తన పురాణ ప్రవచనాల ద్వారా భక్తులకు వివరిస్తానని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆయన తన కుటుంబ సమేతంగా మంగళవారం అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో చాగంటికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతంపలికి స్వామివారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. ఇంతటి మహత్యం కలిగిన ఆలయం దర్శన భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి స్థల పురాణం, ఆలయ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎస్.పద్మనాభం, ఈవో నరేందర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

తెలంగాణ వ్యతిరేకి ప్రధాని మోదీ

▸ సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

కొత్తూర్, జూలై 30: ప్రధాని మోదీ తెలంగాణ వ్యతిరేకి అని, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపడం, ప్రధానికి తెలంగాణ మీద ఎంత ప్రేమ ఉందో అర్థమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. సీపీఐ కొత్తూర్, నందిగామ మండలాల నిర్మాణ కౌన్సిల్ సమావేశం మండల పరిధిలోని జేపీ దర్గా వద్ద మంగళవారం నిర్వహించారు. జంగయ్య హాజరై మాట్లాడుతూ తెలంగాణ విభజన హామీలను కూడా ప్రధాని విస్మరించారని దుయ్యబట్టాడు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సమన్వయ కోసం గ్రామాల్లో నాయకులు పర్యటించి ప్రజలను చైతన్యపర్చాలన్నారు. కష్టజీవుల సమస్యల సాధన కోసం గత ఎన్నోఏళ్లుగా సీపీఐ ప్రజల పక్షాన ఉండి, ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. భవిష్యతు పోరాటాలకు నాంది పలుకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తూర్ మండల కార్యదర్శిగా ఎండీ షకీల్, నందిగామ మండల కార్యదర్శిగా గడ్డం జంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు ఎల్లయ్య, మైసయ్య, అజ్మత్, శంకర్, మహమూద్, లక్ష్మయ్య, సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టాలి

తాండూరు, జూలై 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నూతన రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియను మొదలు పెట్టాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై ఆయన ప్రసంగించారు. ఇది అన్ని వర్గాలకు సంతృప్తికర బడ్జెట్ అన్నారు. జిల్లా వెనుకబాటు తనం, తాండూరు ప్రాంత ప్రాజెక్టులపై ప్రస్తావించారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా రాష్ట్ర తలసరి ఆదాయంలో చిట్ట చివరన ఉండడం బాధాకరం అన్నారు. కోకాపేట్ ధరలు, వికారాబాద్ పరిసర ప్రాంతాల భూముల ధరల్లోని వ్యత్యాసాలను ఆయన ప్రస్తావించారు. తన నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులైన కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న శివసాగర్, బషీరాబాద్ మండలం నవాంద్గి ఎత్తిపోత పథకాల అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమాచారాన్ని సేకరించి అవసరమైన నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలన్నారు. కాగ్నా నదిపై చిన్నతరహా ప్రాజెక్టు నిర్మించేందుకు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. యాసంగి సీజన్‌లో ఈ యేడాది ఎక్కువ మొత్తంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు, మూడు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. కేంద్రం నుంచి పెండింగ్ బకాయిలను విడుదల చేయించడంతో ప్రభుత్వానికి రూ.315.86కోట్ల రుణభారం తగ్గిందని వివరించారు. పేద మహిళలకు రూ.500కు ఇస్తున్న గ్యాస్ సిలిండర్ పథకం ఫలితాలిస్తోందని, మహిళల ఖాతాల్లో సబ్సిడీ డబ్బు జమ అవుతోందని సభలో ఎమ్మెల్యే వివరించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన యాదయ్య



చేవెళ్ల, జూలై 30 : చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు మంగళవారం అసెంబ్లీ హాల్‌లో సీఎంను యాదయ్య కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఫరూఖ్‌నగర్ ఎంఈవో బదిలీ



శంకర్ రాథోడ్

షాద్‌నగర్ రూరల్, జూలై 30: ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ బదిలీ అయ్యారు. 19 ఏళ్లపాటు సుదీర్ఘంగా పనిచేసిన ఆయన సమర్థవంతంగా విధులు నిర్వహించారనే అభిప్రాయం ఉంది. ఎంఈవోల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన షాబాద్ మండలానికి వెళ్లారు. కాగా, ఫరూఖ్‌నగర్ మండలానికి మరో ఎంఈవో వచ్చే వరకు ఆయనే ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

చింతకుంటపల్లి 'నక్ష' సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చింతకుంటపల్లి గ్రామస్తులు

కేశంపేట, జూలై 30: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామ రెవెన్యూ నక్ష సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్సీ నివాసంలో ఆయన్ను కలిసిన గ్రామస్తులు చాలాకాలంగా నక్ష సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయించాలని కోరారు. ఆయన స్పందిస్తూ మండలిలో చింతకుంటపల్లి సమస్యను ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారేశ్, జంగయ్య, మల్లేష్, శ్రీనివాస్, చిన్న మల్లేష్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, జూలై 30: మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన స్థలాలను కేటాయించి భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంగళవారం తహసీల్దార్ ముంతాజ్‌తో కలిసి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అసంపూర్తి పనులు వారం రోజుల్లో పూర్తి చేసి భవనాన్ని ప్రారంభించడానికి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ. 1.18 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించడం జరిగిందని, అసంపూర్తి పనులకు కూడా మరో రూ.20 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు జహంగీర్‌అలీ, మంకి శ్రీను, రాజేశ్, తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

యాచారం, జూలై 30 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి రెడ్డి సంఘం జిల్లా నాయకులు మంగళవారం రూ. 10వేల ఆర్థికసాయమందించారు. మండలంలోని చింతపట్లకు చెందిన లిక్కి మధుసూదన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాదితుడి కుటుంబ వివరాలను రెడ్డి సంఘం జిల్లా నాయకులు అనిరుద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు తెలుసుకొని వైద్యఖర్చులకు రూ.10వేల నగదు అందించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్యారెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

షాబాద్, జూలై 30 : మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, మాజీ వార్డు సభ్యుడు బేగరి గణేష్ మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూలై 30: పదవులు ఉన్నా లేకపోయినా ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలో కొన్ని నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామానికి చెందిన కోశిక పుష్పమ్మ చెన్నయ్య కొంత స్థలం గ్రామ పంచాయతీకి ఇచ్చాడు. అప్పట్లో తన ఇంటి నిర్మాణానికి చేయూతనందించాలని చెన్నయ్య కోరారు. మంగళవారం ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.50వేల విలువ చేసే సామగ్రిని సమకూర్చి అందజేశారు. లాయక్‌అలీ, నర్సింహ, రాములు, తదితరులున్నారు.

కనుల పండువగా బోనాలు



షాబాద్ : బోనాలతో కట్టమైసమ్మ ఆలయానికి తరలిన గ్రామస్తులు



శంషాబాద్ రూరల్ : పోచమ్మ తల్లి తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నాయకులు తదితరులు

షాబాద్, జూలై 30 : మండలంలోని ఎర్రోనిగూడ, షాబాద్, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, తదితర గ్రామాల్లో మంగళవారం పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులంతా అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోన నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామంలో మంగళవారం నేతాజీ యువజన సంఘం, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి తొట్టెల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, శంషాబాద్ మండల మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. గ్రామ దేవత పోచమ్మ తల్లి ఊరేగింపు సందర్భంగా డప్పుల దరువు, యువకుల కేరింతలు, పోతురాజుల విన్యాసాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి, శివాజీ, నీరటి కృష్ణ, శేఖర్, అశోక్, లింగం బిక్షపతి, లింగం నర్సింహ, నర్సింగ్‌రావు, సాయినాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కందుకూరు : మాట్లాడుతున్న బాల్‌రాజ్

కందుకూరు, జూలై 30: గ్రామ పంచాయతీల్లో నిత్యం పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని నిరసనలు తెలిపితే పోలీసులచే ముందస్తు అరెస్టులు చేయడం ఏమిటని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు నగరంలో ధర్నాకు వెళ్లకుండా అరెస్టు చేసిన అనంతరం కార్మికులతో నిరసన ర్యాలీ నిర్వహించి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అరగంట పాటు ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా చేసి, ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీ కార్మిక సంఘం నాయకులు కె.బాల్‌రాజ్‌గౌడ్, యాదయ్య, నర్సింహ, దశరథ, కుమార్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల : మండలంలోని గ్రామపంచాయతీ కార్మికలను పోలీసులు ముందస్తు అరెస్టు చేయటం అన్యాయమని ఏఐటీయూసీ కార్యదర్శి నూదిని రంగారెడ్డి అన్నారు. కార్మికులు ఎలాంటి సమావేశాలు, ధర్నాలు చేపట్టకున్నా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించటం భావ్యం కాదన్నారు.

శంషాబాద్ : అప్రజాస్వామిక నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. ఏఐటీయూసీ నిర్వహిస్తున్న కార్మిక ఉద్యమాలను, ధర్నాలను, చలో అసెంబ్లీ కార్యక్రమాలను చూసి ఓర్వలేక అక్రమ నిర్బంధాలకు పాల్పడుతుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి కార్యదర్శి దత్తు, ఎస్.మల్లేష్ కార్యదర్శులు దేవేందర్‌గౌడ్ మదిలేటి స్వామి కార్మికులను అక్రమంగా అరెస్టు చేశారన్నారు.

చేవెళ్ల : అక్రమ అరెస్టులలో ఉద్యమాన్ని ఆపలేరని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తెలిపారు. మున్సిపాల్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకై ఇందిరా పార్కులో తలపెట్టిన మహా ధర్నాకు వెళ్తున్న ఏఐటీయుసీ నాయకులను మంగళవారం చేవెళ్ల పోలీస్‌లు అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వం అని చెప్పుకొని అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తుందని మండిపడ్డారు. సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, ఎండి మగ్బుల్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు, నాయకులు, తదితరులు ఉన్నారు.

యాచారం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వెళ్లే అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులను మంగళవారం ఉదయం పోలీసులు పది మందిని ముందస్తు అరెస్టు చేశారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐలు శంకర్‌కుమార్, నర్సింహారావులు తెలిపారు.

కేశంపేట : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టారు. విషయం తెలుసుకున్న కేశంపేట పోలీసులు పాండయ్య, శ్రీశైలం, రమాదేవి ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చేవెళ్ల : కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ బాటలో నడుస్తోందని సీఐటీయూ జిల్లా సహాచ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో హైదరాబాద్‌కు మండల ఆశాకార్యకర్తలు వెళ్లకుండా అడ్డుకుని పోలీస్‌లు స్టేషన్‌కు తరలించారు.

కొత్తూర్ : సమస్యల సాధన కోసం ఆశాలు ఇచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు సీఐటీయూ జిల్లా నాయకులు బీసా సాయిబాబాతో పాటు, ఆశాలను ముందస్తు అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఆశాలు జహంగీర్‌బీ, మంజుల, ఇందిరా, నవనీతలు అరెస్టైనవారిలో ఉన్నారు.



మాడ్గుల : అరెస్టయిన మాడ్గుల, ఇర్విన్ గ్రామాల కార్మికులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కందుకూరు : జానపద గేయాలతో చైతన్యం కలిగిస్తున్న కళాకారులు

కందుకూరు, జూలై 30: అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు మంగళవారం మండలంలోని మురళీనగర్ గ్రామస్తులను జానపద గేయాలతో అవగాహన కల్పించారు. ప్రతీ ఇంటి ఆవరణలో వర్షపు నీటిని నిల్వఉండకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అనిల్, ఎల్.శ్రీనివాస్, ఈశ్వర్, సంతోష, సత్యవాణి, కరుణ, సంతోష, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

షాబాద్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ వైద్యాధికారి డాక్టర్ తబస్సుమ్ మెహర్‌జా అన్నారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో కొందుర్గులో విధులు నిర్వహించిన డాక్టర్ తబస్సుం మెహర్‌జా షాబాద్ పీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఫార్మసిస్ట్ శంకర్, స్టాఫ్‌నర్సు సౌజన్య, యూనాని వైద్యసిబ్బంది తాహెర్, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న పశువైద్యుడికి సన్మానం



ఆదిభట్ల, జూలై 30 : ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగర కలాన్‌లో పశు వైద్యాధికారిగా సేవలందించి బదిలీపై వెళ్తున్న డాక్టర్ సురేందర్‌కు గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏడు సంవత్సరాలుగా ఆదిభట్ల మున్సిపాలిటీలో పనిచేసి ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారు. ఎంతో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలు చేరువైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మూగ జీవాలకు సేవలందించేందుకు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి మరీ సేవలందించినట్లు పలువురు గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

గ్రామాభివృద్ధిలో అధికారులది కీలక పాత్ర

మొయినాబాద్ రూరల్, జూలై 30: గ్రామాలాభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులది కీలక పాత్ర అని కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం మండలాధ్యక్షుడు గౌండ్ల నిరంజన్‌గౌడ్ తెలిపారు. నక్కలపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా నాలుగు సంవత్సరాలుగా పనిచేసిన ప్రియాంక.. బదిలీ వెళ్లడంతో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమెను నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి హైమద్, నూతన పంచాయతీ కార్యదర్శి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు గౌరి రవి, నాయకులు మహ్మద్ జాంగీర్, నీలకంఠం, గౌరీ కృష్ణ, శ్రీకాంత్, యాదమ్మ, సోని, జహంగీర్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శి ప్రియాంకను సన్మానిస్తున్న గౌండ్ల నిరంజన్ గౌడ్

శంకర్ కొండ నాయక్‌గా శ్రీను నాయక్



శ్రీనును సన్మానిస్తున్న రవీందర్ నాయక్

ఆమనగల్లు, జూలై 30: శంకర్ కొండ తండా నాయక్‌గా నేనావత్ శ్రీను నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం తండాలో గిరిజనులు సమావేశమై తమ ఆచార వ్యవహారాల ప్రకారం ఎన్నిక చేపట్టారు. గతంలో నాయక్‌గా వ్యవహరించిన వెంకట్య నాయక్ మనుమడు శ్రీను నాయక్ తండా నాయక్‌గా ఎన్నికైనట్లు నాయక్‌ల చైర్మన్ రవీందర్ నాయక్ ప్రకటించారు. శ్రీను నాయక్‌ను సత్కరించి అభినందించారు. మాజీ సర్పంచ్ అమర్‌సింగ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు, నాయకులు పత్యనాయక్, పాండునాయక్, శంకర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో లయన్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి

ఆమనగల్లు, జూలై 30: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మరాశిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డిలతో కలిసి రీజియన్ చైర్మన్ శ్రీను ప్రారంభించారు. 920 మందికి డాక్టర్ దామోదర్‌రెడ్డి, సంపత్‌ల ఆధ్వర్యంలో మధుమేహం, సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 27మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ దామోదర్ రెడ్డి, కృష్ణ, వెంకట్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్ రెడ్డి, జూలూరి రమేశ్, జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, కండె ఓంకారం, విష్ణువాసు రెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, సభ్యులు వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కడ్తాల మండల కేంద్రంలో అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ బాబు రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి ప్రారంభించారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. క్లబ్ మండల శాఖ అధ్యక్షుడు సుసాని విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో 150మందికి భోజనం ఏర్పాటు చేశారు. క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాఅదనపు కార్యదర్శి అంజయ్య, ప్యాక్స్ డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు.

కందుకూరు : క్యాన్సర్‌తో బాధపడుతున్న తోటి విద్యార్థికి వైద్య పరీక్షల నిమిత్తం స్నేహితులు చేతనందించారు. కందుకూరు ఉన్నత పాఠశాలలో 2003-2004 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు.. తమ స్నేహితుడు ఇస్లావత్ పాండు కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మంగళవారం మెరుగైన వైద్యసేవలకు రూ.65వేలు పాండు కుటుంబసభ్యులకు అందించారు.

చౌదరిగూడ : పదేళ్ల బీఆర్ఎస్ రాచరిక పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్వేషం వెళ్లగక్కుతున్నారని జిల్లేడ్ చౌదరిగూడ మండల ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు చందునాయక్ విమర్శించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయినా.. సంక్షేమాన్ని మరువకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమైపోయాయన్నారు.

క్రైం కార్నర్

150 గ్రాముల గంజాయి పట్టివేత

కొందుర్గు, జూలై 30: మండల కేంద్రం శివారులో 150 గ్రాముల గంజాయిని మంగళవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కృష్ణయ్య కథనం మేరకు.. చిన్నఎల్కిచర్ల, పులుసుమామిడి పంచాయితీ కార్యదర్శులు సాయేల్ జాన్, ఫయాజ్‌ఖాన్, పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది చందర్, జె.వెంకటయ్యలు కలిసి ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రం శివారులోని ఇన్‌క్రెడిబుల్ ఇండియా వెంచర్ దగ్గర ఎస్సై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. షాద్‌నగర్ నుంచి స్కూటీపై ఇద్దరు వ్యక్తులు రాగా.. అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఈమేరకు స్కూటీ డిక్కీలో కొన్ని బ్రౌన్ కలర్ ప్యాకెట్లు కనిపించాయి. వారి వివరాలు అడిగారు. నారాయణపేట జిల్లా పరిధిలోని దన్వాడకు చెందిన భానుప్రకాష్ గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని తిమ్మాజీపేట మండలం అప్పాజిపల్లికి చెందిన సాయి ప్రకాష్‌రెడ్డి అని తెలిపారు. ప్యాకెట్లలో గంజాయి ఉందని తెలపడంతో సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు. మొత్తం 5 ప్యాకెట్లలో 155.98 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు చేయగా, నిందితులను అరెస్ట్‌చేసి, స్థానిక హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● ఏడుగురిపై కేసు.. రూ.లక్షా 20వేలు స్వాధీనం

శంషాబాద్ రూరల్, జూలై 30: శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి గ్రామ శివారులోని అరుణ్‌కుమార్ ఫాంహౌస్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం రాత్రి ఫాంహౌస్‌పై దాడి నిర్వహించగా పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు మంగళవారం ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,20,250, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధికుక్కల దాడిలో దూడ మృతి, గేదెకు గాయాలు

యాచారం/షాబాద్ జూలై 30 : యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 5గంటల ప్రాంతంలో వీధి కుక్కలు ఆవుదూడను చంపి తిన్నాయి. మేడిపల్లికి చెందిన బండరాజు తన ఆవుతో పాటు దూడను పంట పొలం వద్ద కొట్టంలో కట్టేశాడు. మంగళవారం ఉదయం రాజు ఆవు పాలు పితకడానికి వెళ్లగా పది వీధి కుక్కలు ఆవుదూడను తింటున్నాయి. కుక్కలను తరిమి దూడను కాపాడేందుకు యత్నించగా అప్పటికే మరణించిందని రైతు వాపోయాడు. దూడ మరణంతో ఆవు పాలు ఇవ్వలేదని ఆందోళన చెందారు. షాబాద్ మండల పరిధిలోని కేశవగూడకు చెందిన ఒగ్గు మల్లయ్యకు చెందిన పాడి గేదెను కుక్కలు గేదె రెండు చెవులను కొరుక్కుతిన్నాయి. అధికారులు గ్రామంలో వీధికుక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుడి గంటల అపహరణ కేసులో నిందితుడి రిమాండ్

యాచారం, జూలై 30 : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, ముత్యాలమ్మ, ఈదమ్మ ఆలయాల్లో గంటలు అపహరించిన నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ, వేంకటేశ్వరస్వామి, ఈదమ్మ ఆలయాల్లో ఇటీవల రూ.40వేల విలువైన గంటలు చోరీ అయ్యాయి. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు దొంగ కోసం గాలిస్తుండగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన దుర్గాప్రసాద్ పోలీసులకు చిక్కాడు. ఇటీవల మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో, ముత్యాలమ్మ, ఈదమ్మ అమ్మవారి ఆలయాల్లో గంటలు చోరీ చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. క్రైం పార్టీ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. సోమవారం ఉదయం గున్‌గల్ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా దుర్గాప్రసాద్ అనుమానాస్పందంగా తిరుగుతుండగా పెట్రో మొబైల్-1 పోలీసులకు అనుమానం వచ్చి స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడంతో నేరం అంగీకరించాడు. నల్గొండ జిల్లా మర్రిగూడ స్టేషన్‌లో పలుచోరీ కేసులు అతడిపై ఉన్నాయి. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లోని రత్నానగర్‌లో, ఇబ్రహీంపట్నంలో ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసముంటున్నట్లు నిందితుడు చెప్పాడు. నిందితుడు దుర్గాప్రసాద్‌ను మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

కత్తితో బెదిరించిన వ్యక్తిపై కేసు

ఆదిభట్ల, జూలై 30 : కత్తి చూపించి చంపేస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద నివాసం ఉండే నేనావత్ చరణ్ తన స్నేహితులు కోటేష్, నాగరాజు, చింటూలతో కలిసి సోమవారం సాయంత్రం ఊరి చివర క్రికెట్ ఆడుతున్నారు. అదే కాలనీకి చెందిన సోఫియాన్ కూడా ఆడుకోవడానికి అక్కడికి వచ్చి వారితో గొడవ పడి చరణ్‌పై బ్యాట్‌తో దాడి చేశాడు. తమపై దాడి చేసిన విషయం సోఫియాన్ సోదరుడు సోహెల్‌కు ఫిర్యాదు చేయడంతో సోహెల్ వచ్చి తన తమ్ముడిని మందలించి ఇంటికి తీసుకెళ్లాడు. సోదరుడు మందలించడంతో కోపంతో తిరిగి వచ్చిన సోఫియాన్ మళ్లీ చరణ్‌తో గొడవకు దిగాడు. అక్కడే ఉన్న ఎండీ కరీమ్ గొడవను ఆపేందుకు యత్నిస్తుండగా సోఫియాన్ అతని సోదరులు సోహెల్, సాహిల్ ఇంక అతని తండ్రి వచ్చి గొడవకు కారణం నీవే అంటూ.. నేనావత్ చరణ్‌ను, గొడవను ఆపడానికి వచ్చిన కరీంలకు కత్తి చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరించారు. నేనావత్ చరణ్ ఫిర్యాదు మేరకు సోఫియాన్, సోహెల్, సాహిల్ అతని తండ్రిపై కేసు నమోదు చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



షాబాద్ : కలెక్టర్ నుంచి రుణమాఫీ చెక్కు అందుకుంటున్న రైతు మల్లేష్‌గౌడ్

షాబాద్, జూలై 30 : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాణిక్యంగౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన తాళ్ల మల్లేష్‌గౌడ్‌కు పంట రుణమాఫీ చెక్కును కలెక్టర్ శశాంక అందజేశారు. మాణిక్యంగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని నిరూపించుకుందన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న రేవంత్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు.

800 మంది రైతులకు రూ.8 కోట్ల రుణాలు మాఫీ

ఆమనగల్లు : రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా ఆమనగల్లు పీఏసీఎస్ పరిధిలో 450 మంది రైతులకు రూ.4 కోట్లు రుణమాఫీ జరిగినట్లు డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. మాఫీ అయిన డబ్బును రైతుల ఖాతాల్లో జమచేసి కొత్త రుణాలు అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన రెండో విడత రుణమాఫీ విడుదల కార్యక్రమంలో కలెక్టర్‌తో కలిసి వెంకటేశ్ పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా రెండో విడత 22,915 మంది రైతులకు రూ.218.12 కోట్లు రుణాలు మాఫీ అయినట్లు పేర్కొన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఆంక్షలు విధించకుండా మాఫీ చేయాలని కోరారు. గ్రూప్-4 ఉద్యోగుల కుటుంబాలకు రైతు రుణమాఫీ వర్తించడం లేదని, ప్రభుత్వం గుర్తించి వారికి అందేలా చూడాలని వెంకటేశ్ విజ్ఞప్తి చేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

షాద్‌నగర్ రూరల్ : రైతులను సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పని చేస్తుందని మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. ప్రభుత్వం రెండో విడత రైతు రుణ మాఫీపై ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలని, అధిక దిగుబడులు వస్తాయన్నారు. నాయకులు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నాగి సాయిలు తదితరులు పాల్గొన్నారు.